క్లుప్తంగా

తైక్వాండో పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

గురజాల : ఈ నెల 11,12,13 తేదీల్లో రేపల్లెలో జరిగిన రాష్ట్ర తైక్వాండో ఛాంపియన్ పోటీల్లో జూనియర్/ సబ్ జూనియర్ పోటీల్లో పల్నాడు తైక్వాండో మార్షల్ ఆర్ట్ క్లబ్ గురజాలకు చెందిన 8 మంది విద్యార్థులు తమ ప్రతిభ కనబరిచారు. బంగారం, రజితం, కాంస్య పతకాలు సాధించారు. ప్రతిభ కనబరచిన విద్యార్థులను కోచ్ డి హనుమాన్, తదితరులు అభినందించారు.

వైభవంగా వెంకటేశ్వర స్వామి కల్యాణం



పిడుగురాళ్ల: పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం వెనుక ఉన్న శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి కల్యాణం నిర్వహించారు. భోగి పండుగ రోజు భోగి నీళ్లతో స్వామివారికి స్నానం ఆచరింపజేసి కల్యాణం నిర్వహించారు. అదేవిధంగా కల్యాణం తిలకించేందుకు వచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు జరగకుండా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు నిర్వహించారు. అదేవిధంగా పట్టణంలోని అభయాంజనేయస్వామి దేవాలయంలో శ్రీ దేవి భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామివారి కల్యాణం నిర్వహించారు. కార్యక్రమంలో పదుల సంఖ్యలో పుణ్య దంపతులు హాజరై కల్యాణంలో పాల్గొన్నారు.

కోడిపందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవు



పట్టణ సీఐ బాలకృష్ణ

మాచర్ల: పట్టణంలో సంక్రాంతి, కనుమ పండుగ సందర్భంగా ఎక్కడైనా కోడిపందేలు, జూదాలు, బెట్టింగ్ నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అర్బన్ సీఐ టి బాలకృష్ణ అన్నారు. శనివారం పట్టణ పోలీసు స్టేషన్‌లో విలేకరులతో మాట్లాడుతూ జూదరులను హెచ్చరించి మాట్లాడారు. ఎక్కడైనా పొరపాటున కూడా కోడి పందేలు, బెట్టింగ్, జూదం లాంటి ఆటలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు కేసులు నమోదు చేసి జైలుకు పంపడం జరుగుతుందన్నారు. ఈ విషయాన్ని గమనించి పోలీసు శాఖకు సహకరించాలని కోరారు.

పట్టణంలో పట్టపగలు చోరీ

పిడుగురాళ్ల: పట్టపగలే చోరీ జరిగిన ఘటన పట్టణంలోని జానపాడు డొంక రోడ్డులో బుధవారం జరిగింది. ఘటనకు సంబంధించి పట్టణ ఎస్ఐ షేక్ అమీర్ తెలిపిన వివరాల మేరకు పట్టణానికి చెందిన నీలబోలు శ్రీను తన స్వగ్రామమైన పార్వతి పురానికి కుటుంబ సభ్యులతో కలిసి సంక్రాంతి పండుగకు వెళ్లారు. రోజు మాదిరిగానే తన ఇంటి పని మనిషి ఇల్లు ఊడ్చేందుకు రావడంతో ఇంటి తలుపులు పగలగొట్టి ఉన్నాయి. దీంతో ఇంటి యజమానికి ఫోన్ చేసి సమాచారం అందించడంతో హుటాహుటిన ఇంటికి చేరుకుని పరిశీలించారు. ఇంట్లో ఉన్న సుమారు 40 గ్రాముల బంగారు వస్తువులు దొంగలు అపహరించినట్లు గుర్తించారు. బాధితులు పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పట్టణ ఎస్ఐ సంఘటనా స్థలానికి చేరుకుని దొంగతనం జరిగిన ప్రదేశాన్ని పరిశీలించారు. అనంతరం కేసును పరిశీలించి దర్యాప్తు చేస్తున్నామన్నారు. ఈ బంగారు నగల విలువ సుమారు రూ. 1.20 లక్షలు ఉంటుందని తెలిపారు.

వైభవంగా గోదా రంగ నాయకుల కల్యాణోత్సవం



గురజాల : ధనుర్మాస మహోత్సవాల్లో భాగంగా దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండల పరిధిలోని చర్లగుడిపాడు గ్రామంలో వేణుగోపాల స్వామి, జంగమహేశ్వరపురంలోని శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దేవాలయంలో సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని గోదా రంగ నాయకుల కల్యాణోత్సవం వేడుకలు కన్నుల పండువగా నిర్వహించారు. తొలుత స్వామి వారి ఉత్సవ విగ్రహాలను నూతన వస్త్రాలతో పూలమాలలతో అలంకరించారు. మంత్రోచ్ఛరణల మధ్య స్వామివార్ల కల్యాణ మహోత్సవం నిర్వహించారు. స్వామి వారి కల్యాణం తిలకించిన భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు. అదే విధంగా గురజాలలోని శ్రీ సీతారాముల వారి దేవాలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య మహిళలతో ప్రత్యేక కోలాటం నిర్వహించారు. దేవాలయ కమిటీ చైర్మన్ కందుల సాంబయ్య న్నారు.

కారెంపూడి: కారెంపూడిలోని శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవాలయంలో శనివారం రాత్రి గోదారంగనాయకస్వామివారి కల్యాణోత్సవం శనివారం రాత్రి వైభవంగా జరిగింది. ఆలయ అర్చకుడు సత్యనారాయణా చార్యుల నిర్వహించిన గోదారంగనాయకుల కల్యాణోత్సవంలో వందలాదిగా భక్తులు పాలుపంచుకున్నారు.

ఘనంగా భోగ భాగ్యాల వేడుకలు

- కుటుంబ సమేతంగా వేడుకల్లో పాల్గొన్న ప్రభుత్వ విప్ పీఆర్కే
- పలుగ్రామాల్లో ఘనంగా భోగి వేడుకలు



పట్టణంలో భోగి మంటల వద్ద ఆనందంతో స్థానికులు



కోలాట ప్రదర్శనను తిలకిస్తున్న ప్రభుత్వ విప్ పీఆర్కే కుటుంబ సభ్యులు



భోగిమంటలు వేసిన కార్మికులు



శ్రీనగర్‌లో భోగి మంటల వద్ద సంబరాలు చేసుకుంటున్న స్థానికులు



పిన్నెల్లిలో హరిదాసుల సంకీర్తన

మాచర్ల: భోగి ఉత్సవాల సందర్భంగా శనివారం బస్టాండ్ ప్రాంతంలో వేంచేసియున్న వెంకటేశ్వర స్వామివారి ఊరేగింపు నిర్వహించారు. ఆర్యవైశ్య మహిళలు, యువతులు కోలాటం నిర్వహిస్తూ పట్టణంలో దేవుని పాటలతో అలరిస్తూ ఊరేగింపు జరిపారు. అనంతరం పల్నాడు జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షులు, ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ఇంటి ప్రాంతంలో ప్రదర్శన నిర్వహించగా ఆయన కుటుంబ సభ్యులతో పాల్గొని శ్రీ వెంకటేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు జరిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బోయ రఘురామిరెడ్డి, వెల్దుర్తి ఎంపీపీ చింతా శివరామయ్య, వైఎస్సార్ సీపీ నాయకులు ఆదినారాయణతో పాటు ఆయా వార్డు కౌన్సిలర్లు పలువురు పాల్గొన్నారు. అంతకుముందు తెల్లవారుఝాము నుంచి వందలాది మంది మహిళలు శ్రీ వెంకటేశ్వర స్వామిని ఊరేగింపు జరుపుతూ నగర సంకీర్తన జరిపారు. వందలాది మంది భక్తులకు ఆలయ ఈఓ శ్రీగిరిరాజు నర్సింహ్మ బాబు, నిర్వాహకులు వీరాంజనేయరెడ్డి, చుండూరు మల్లిఖార్జునరావుల ఆధ్వర్యంలో తీర్థ ప్రసాదాలు అందించారు.

మాచవరం: సంక్రాంతి పండుగను పురస్కరించుకుని మండలంలోని పలు గ్రామాల్లో భోగి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ప్రతి ఇంటి ముంగిట రంగవల్లులతో ముగ్గులు వేసి, పూలతో గొబ్బెమ్మలను అలంకరించారు. భోగి మంటలు వేసి, పుణ్యస్నానాలు ఆచరించి, నూతన వస్త్రాలు ధరించి వేడుకలు జరుపుకున్నారు. గ్రామాల్లో గంగిరెద్దుల ఆటా పాటలు, హరిదాసులు సంకీర్తనలతో సందడి నెలకొంది. హరేరామ భక్తి గీతాలు ఆలపిస్తూ, దానం చేసిన వారిని పాడి పంటలతో సుఖంగా జీవించాలని దీవించారు.

దాచేపల్లి : మండల వ్యాప్తంగా భోగి పండుగ వేడుకలు శనివారం వైభవంగా జరిగాయి. మండలంలోని శ్రీనగర్ ప్రభుత్వ పాఠశాలల్లో భోగి మంటలు వేసి మహిళలు కోలాటం ప్రదర్శించారు. పండుగ సందర్భంగా పులగం పంపిణీ చేశారు. టెక్నో పెయింట్స్ అధినేత ఆకూరి శ్రీనివాసరెడ్డి, సర్పంచ్ కూసం నాగిరెడ్డి, ఎంపీటీసీ ఆకూరి కాశిరెడ్డి, మాజీ సర్పంచ్ మాశెట్టి పుల్లారావు, వణుకూరి రామకృష్ణారెడ్డి తదితరులు భోగి పండుగ వేడుకల్లో పాల్గొని ముగ్గుల పోటీలు, ఆటల పోటీల్లో విజేతలుగా నిలిచిన మహిళలకు బహుమతులు అందజేశారు. పెదగార్లపాడులో వైఎస్సార్ సీపీ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన ముగ్గుల పోటీల్లో ఎస్ఐ జీ. సంధ్యారాణి పాల్గొని విజేతలకు బహుమతులు అందించారు. భోగి పండుగ వేడుకల్లో జెడ్పీటీసీలు మూలగొండ్ల ప్రకాష్‌రెడ్డి, జంగా వెంకటకోటయ్య, ఎంపీపీ కటకం జయశ్రీ బ్రహ్మనాయుడు, యార్డు చైర్మన్ గొట్టిముక్కల పెదహనిమిరెడ్డి, వైఎస్సార్ సీపీ మండల, పట్టణ కన్వీనర్లు కోట కృష్ణ, షేక్ సుభానీ, మాజీ సర్పంచ్‌లు బుర్రి విజయ్ కుమార్‌రెడ్డి, మందపాటి రమేష్‌రెడ్డి, మాజీ ఎంపీపీ కొప్పుల సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

పిడుగురాళ్ల: పట్టణంలో భోగి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఎక్కడ చూసినా, ఏ అపార్ట్‌మెంట్ చూసినా భోగి మంటల వద్ద పండుగ వాతావరణంతో సందడి వాతావరణం కనిపించింది. ఉదయానే సాంప్రదాయ దుస్తులు ధరించి భోగి మంటల చుట్టూ తిరుగుతూ భోగి పాటలను పాడుకుంటూ ఆనందంతో వేడుకలను జరుపుకున్నారు.

గ్రామాల్లో హరిదాసుల సందడి

గురజాల : పల్లెల్లో భోగి మంటలు ఎగిసిపడ్డాయి. భోగి మంటల వద్ద పిల్లలు సందడి చేశారు. సంక్రాంతి ముందు రోజు వచ్చే భోగి సందర్భంగా గ్రామాలకు ఎక్కడెక్కడో ఉన్న వారంతా సొంతూళ్లకు చేరడంతో గ్రామాలు సందడిగా ఉన్నాయి. సంక్రాంతి ముందు రోజు వచ్చే పండుగను నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో శనివారం సందడిగా జరిపారు. నియోజకవర్గ వ్యాప్తంగా భోగి పండుగను ప్రజలు ఘనంగా నిర్వహించారు. సాంప్రదాయంగా వస్తున్న భోగి మంటల్లో తమ ఇళ్లలోని పాత వస్తువులు మంటల్లో వేశారు. గ్రామాల్లో హరిదాసుల రాకతో సందడి వాతావరణం నెలకొంది. భోగ భాగ్యాలతో సుఖసంతోషాలతో ఆనందంగా జీవించాలని ఆకాంక్షిస్తూ దేవాలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు.

రెంటచింతల: అగ్ని దేవునికి చేయు ఆరాధనే భోగి మంటలని పురాణాల ద్వారా తెలుస్తోందని మిట్టగుడిపాడు గ్రామంలో వేంచేసిన శ్రీ వేణుగోపాల స్వామి దేవస్థానం ప్రధాన అర్చకులు వడ్లమాను రమణాచార్యులు అన్నారు. శనివారం భోగి పండుగ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు.

మాచర్ల: పట్టణంలో శనివారం భోగిమంటల సందడి కొనసాగింది. అందులో భాగంగా తెల్లవారుఝాము నుంచే వివిధ ప్రాంతాల్లో ప్రజలు భోగి మంటలు వేశారు. మున్సిపల్ చైర్మన్ బోయ రఘురామిరెడ్డి, మాజీ చైర్మన్ తురక కిషోర్‌ల ఆధ్వర్యంలో ఆయా వార్డులలో భోగి మంటలు వేశారు. ఈ సందర్భంగా పలు వార్డుల్లో పారిశుధ్య కార్మికులు తెల్లవారుఝామున భోగిమంటలు సందడిని మున్సిపల్ కమిషనర్ ఈవి రమణబాబు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆయా వార్డుల్లో తెల్లవారుఝామున భోగిమంటలు వేసి, భోగి పండుగ సంబరాలు జరుపుకున్నారు.

ఘనంగా భోగి పండుగ వేడుకలు

- 4 తరాలు–49 మంది సంతానం
- భోగి పండుగ వేడుకలలో ప్రత్యేకంగా నిలిచిన వీరవేణి కుటుంబం



భోగి పండుల వేడుకల్లో పాల్గొన్న నాలుగు తరాలకు చెందిన వీరవేణి కుటుంబ సభ్యులు

విజయపురిసౌత్: భోగి పండుగ వేడుకలు విజయపురిసౌత్‌లో శనివారం ఘనంగా జరిగాయి. గ్రామస్తులు పలు కూడళ్లలో తెల్లవారుజామునే లేచి భోగి మంటలు వేసి ఆ మంటలలో నీరు కాచుకొని స్నానాలు చేశారు. గ్రామంలోని గుబ్బల వీరవేణి కుటుంబానికి చెందిన 4 తరాలు మొత్తం 49 మంది కుటుంబ సభ్యులు ఒకే చోటుకు చేరుకున్నారు. భోగి మంటలతో ఒక చోట చలి కాచుకున్నారు. చిన్నారులను ఒక చోట కూర్చొంచబెట్టి రేగిపండ్లు, నాణేలతో కలిపి పిల్లల తలలపై పోసి ఆశీర్వదించారు. అండమాన్ నికోబార్, బీహార్, చెన్నై, బెంగుళూరు, హైదరాబాద్, విజయనగరం, రాజోలు, కాకినాడ తదితర ప్రాంతాలలో వివిధ వృత్తులలో స్థిరపడి సంక్రాంతి వేడుకలను జరుపుకునేందుకు వీరవేణి కుటుంబ పెద్ద కావడంతో ఇక్కడకు చేరుకున్నారు. కుమారులు, కోడళ్ళు, మనవళ్ళు, మనుమరాళ్ళు, కుమార్తెలు, అల్లుళ్ళు, మనుమలు, మనుమరాళ్ళు, ముని మనవళ్ళు, మనుమరాళ్ళలో ఇల్లు పూర్తిగా సంక్రాంతి సంబరాలతో నిండిపోయింది. దీంతో అందరిలో ఆనందం, సంతోషంగా గడిపేందుకు ఈ పండుగకు అందరూ ఒక చోటికి చేరడంతో ప్రత్యేకంగా నిలిచారు.

పలువురు టీడీపీ నేతలు వైఎస్సార్ సీపీలో చేరిక



పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానిస్తున్న ప్రభుత్వ విప్ పిన్నెల్లి

మాచర్ల: రాష్ట్రంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలు అమలు చేయడం, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు ఎంతో ప్రయోజనం కలిగిస్తుండడంతో వివిధ పార్టీల నుంచి తండోపతండాలుగా వైఎస్సార్ సీపీలోకి చేరుతున్నారని పల్నాడు జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షులు, ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. శనివారం వెల్దుర్తి మండలంలోని రచ్చమల్లపాడు గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు 30 మంది కుటుంబాల సమేతంగా వైఎస్సార్ సీపీలో పీఆర్కే సమక్షంలో శనివారం చేరారు. ఈ సందర్భంగా వారినుద్దేశించి మాట్లాడుతూ పార్టీలో చేరిన ప్రతి ఒక్కరికీ న్యాయం చేస్తామని, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు జేజేలు పలికేందుకు వైఎస్సార్ సీపీ ఉందన్నారు. పార్టీలో చేరిన ప్రతి వారిని ఆదరించి వారికి సముచిత స్థానం కల్పిస్తామని పీఆర్కే చెప్పారు. పార్టీలో చేరిన వారిలో రచ్చమల్లపాడు గ్రామ సర్పంచ్ పేర్లవల్లి పెద్దగాలయ్య ఆధ్వర్యంలో రచ్చమల్లపాడు గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు షేక్ నాగూర్, షేక్ జానీబాషా, షేక్ ఖాశిం, నాగూర్‌వలి, కరిముల్లా, షేక్ మౌలాలి, కామేపల్లి పకీర్, దొంగరి మల్లిఖార్జున్, వీర కృష్ణాంజనేయులు, లక్ష్మయ్య, చెన్నయ్య, నాగయ్య, రామాంజనేయులు, ఆంజనేయులు, మరో 15 కుటుంబాలు పార్టీలో చేరారు. వీరందరికి వైఎస్సార్ సీపీ పార్టీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం భోగి పండుగ పురస్కరించుకుని రచ్చమల్లపాడు నాయకులు ఆధ్వర్యంలో పీఆర్కేను ఘనంగా శాలువాలతో సత్కరించారు.

మకర జ్యోతి దివ్య దర్శనం



పిడుగురాళ్లరూరల్: స్వామియే శరణమయ్యప్ప అంటూ అయ్యప్పనగర్ భక్తులతో మార్మోగింది. మండలంలోని అయ్యప్పనగర్‌లో వేంచేసియున్న అయ్యప్ప స్వామి దేవస్థానంలో మకర జ్యోతి దర్శనం, దివ్య పడిపూజ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. అయ్యప్ప స్వామి దేవస్థానంలో మకర జ్యోతి దివ్య దర్శనం జరిగింది. శబరిలో మలలో ఏ విధంగా మకర జ్యోతి దివ్య దర్శనం జరుగుతుందో అదేవిధంగా భక్తులకు మకర జ్యోతి దివ్య దర్శనాన్ని దేవస్థానం ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. అనంతరం దివ్య పూడి పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా శ్రీ రామ్ పిరమిడ్ ట్రస్ట్ హైదరాబాద్, పొట్టూరి రాంబాబు పిరమిడ్ ట్రస్ట్ హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో అఖండ దీపారాధన, దివ్య పడి పూజా కార్యక్రమం నిర్వహించారు. దివ్య పడిపూజా కార్యక్రమానికి దేవాలయ ప్రధానార్చకులు వీకే సతీష్‌శర్మ ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు.

ముగ్గుల పోటీ విజేతలకు బహుమతుల ప్రదానం



బహుమతిని అందజేస్తున్న నిర్వాహకులు



బహుబతులు అందజేస్తున్న ఎంపీపీ దాసరి చౌడేశ్వరి, సర్పంచ్ మండలపు విజయలక్ష్మి లచ్చిరెడ్డి

రెంటాల(రెంటచింతల): మన పూర్వీకుల నుంచి వస్తున్న సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని జెడ్పీటీసీ మాజీ సభ్యుడు నవులూరి భాస్కరరెడ్డి కోరారు. శనివారం మండలంలోని రెంటాల గ్రామంలో భోగి, సంక్రాంతి పర్వదినాలను పురష్కరించుకుని శ్రీ లక్ష్మీ చెన్నకేశవస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహించిన మండల స్థాయి ముగ్గుల పోటీలలోని విజేతలకు ఆయన బహుమతులను అందజేసి మాట్లాడారు. భోగి పండుగ పర్వదినం రోజున మహిళలు ఎంతో ఉత్సావంతో రంగురంగుల రంగవల్లులతో తమలో దాగిన ప్రతిభను కనపర్చడం సంతోషకరమన్నారు. ఎం. లక్ష్మీ అమూల్య, జే. సుమతి, ఎస్.సీత, ఎస్. లక్ష్మీ మనీషా, వెన్నా సంధ్యా వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ, నాల్గావ, ఐదవ బహుమతులను గెలుపొందినట్లు న్యాయ నిర్ణేత ఉపాధ్యాయురాలు పల్లెర్ల భారతి తెలిపారు. కార్యక్రమంలో 59 మంది పాల్గొనగా దేవస్థానం అధ్యక్షులు నవులూరి రంగారెడ్డి, కమిటీ సభ్యులు పేరం రంగారెడ్డి, ఇగుటూరి సత్యనారాయణరెడ్డి, పేరం నరేంద్రారెడ్డి, డాక్టర్ నవులూరి క్రాంతికుమార్‌రెడ్డి, గొంటు కోటిరెడ్డి, తన్నీరు రాము తదితరులు పోటీలను పర్యవేక్షించారు.

పాలువాయి(రెంటచింతల): ముగ్గుల పోటీలు సంస్కృతి సాంప్రదాయాలకు ప్రతీకలని ఎంపీపీ దాసరి చౌడేశ్వరి అన్నారు. శనివారం మండలంలోని పాలువాయి గ్రామంలో సంక్రాంతి పర్వదినాన్ని పురష్కరించుకుని రజకయూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన మండల స్థాయి ముగ్గుల పోటీలలోని విజేతలకు సర్పంచ్ మండలపు విజయలక్ష్మి లచ్చిరెడ్డి, ఎంపీటీసీ గుంటా ముక్కంటేశ్వరరెడ్డి కలిసి బహుమతులను అందచేసి ఆమె మాట్లాడారు. తరాలు మారిన మన మూలాలు మరవకూడదన్నారు.

మన సంస్కృతి సంప్రదాయాలలో బాగంగా పండుగ పర్వదినాలను మన భవిష్యత్ తరాలకు అందించాల్సిన బాధ్యత మన అందరిపై ఉందన్నారు. ముగ్గుల పోటీలు ఐక్యతకు, ప్యాయతకు నిదర్శనమన్నారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ, 4వ బహుమతి, 5వ బహుమతిలను, కన్సోలేషన్ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు కొక్కొండ్ల బ్రహ్మం, వైఎస్సార్ సీపీ నేతలు శొంఠిరెడ్డి విజయ, శొంఠిరెడ్డి చిన గురవారెడ్డి, రజక యూత్ సభ్యులు పర్యవేక్షించారు.

హెల్మెట్ భారం కాదు భరోసా

- ఎస్ఐ అమీర్ బాషా
- క్యూబ్ రూట్స్ పౌండేషన్ హెల్మెట్‌లు పంపిణీ



హెల్మెట్‌ను పంపిణీ చేస్తున్న పట్టణ ఎస్ఐ అమీర్ బాషా

పిడుగురాళ్లరూరల్: ఉరుకులు, పరుగుల జీవితంలో వేగానికి ఉన్న ప్రాధాన్యతకు భద్రత ఇవ్వకపోవడంతో భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తోందని పిడుగురాళ్ల పట్టణ ఎస్ఐ అమీర్ బాషా అన్నారు. మండలంలోని తుమ్మలచెరువు టోల్‌గేట్ వద్ద క్యూబ్ రూట్స్ పౌండేషన్ ఆధ్వర్యంలో 34వ రోడ్డు భద్రత వారోత్సవల సందర్భంగా వాహన దారులకు హెల్మెట్ పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈసందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన ఎస్ఐ అమీర్ బాషా మాట్లాడుతూ చిన్నపాటి నిర్లక్ష్యం వల్ల నిండు ప్రాణాలుగాల్లో కలిసిపోతున్నాయన్నారు. రోడ్డు ప్రమాదంలో హెల్మెట్ పెట్టుకోకపోవడంతో అక్కడిక్కడే మృతి చెందిన ఘటనలు, గాయాలు అయిన సందర్భంగా ఉన్నాయని వారు అన్నారు. హెల్మెట్ భారం కాదని, అది వారి జీవితానికి భరోసా అన్నారు. హెల్మెట్ ధరించడం వల్ల ప్రమాదాలు జరిగినప్పుడు ప్రాణపాయాలు చాలా తక్కువ అని అందుకే ప్రతి ఒక్కరు తప్పనిసరిగా తలకు హెల్మెట్‌ధరించాలని ఆయన అన్నారు. హైవే ప్రాజెక్టు మేనేజర్ ప్రసాద్ మాట్లాడుతూ బైక్ నడిపే సమయంలో హెల్మెట్ ధరిస్తే ప్రాణాపాయం సురక్షితమని అన్నారు. అనంతరం వంద మందికి పైగా వాహన దారులకు ఉచితంగా హెల్మెట్‌లను అందజేశారు. కార్యక్రమంలో నామ్ సిబ్బంది ప్రవీణ్, నాగార్జున, రవి పాల్గొన్నారు.

విజేతలకు బహుమతుల ప్రదానం



విజేతలకు బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు

దుర్గి: దుర్గిలోని శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి తిరునాళ్ల మహోత్సవం ఘనంగా ప్రారంభించారు. శనివారం ఉదయం నుంచి వివిధ రకాల పోటీలు పండుగ సందర్భంగా నిర్వహిస్తున్నారు. దానిలో భాగంగా ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలైన మహిళలకు బహుమతులు ప్రదానం చేశారు. డ్యాన్స్ బేబి డ్యాన్స్, గాయకులచే పాట కచేరి కార్యక్రమాలు ఆసక్తిగా జరిగింది. గ్రామంలో వివిధ సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. ముగ్గుల పోటీలో మొదటి బహుమతి సీహెచ్ అరుణ, రెండవ బహుమతి శెట్టిపల్లి పావని, మూడవ బహుమతి జి శార్వాణిలకు కటకం బ్రదర్స్ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. 4,5 స్థానాలకు గుండా రాజ్యం, దుర్గా భవానిలకు వాసవి క్లబ్ హైదరాబాద్ వారి కాసుల వెంకటనర్సయ్యలు అందజేశారు. సిహెచ్ అనంతరామయ్య, వై కొండలు, అశోక్, చలవాది అంజలి న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. రాత్రి నిర్వహించిన సాంఘీక నాటకం అలరించింది.

9 మంది జూదరులు అరెస్ట్

రెంటచింతల: మండలంలోని మిట్టగుడిపాడు, తుమృకోట గ్రామాలలో జూదం(పేకాట) ఆడుతున్న 9 మంది అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ సయ్యద్ షమీర్‌భాష శనివారం తెలిపారు. మిట్టగుడిపాడు గ్రామ శివార్లోని పొలాలలో పేకాట ఆడుతున్న నలుగురిని, తుమృకోట గ్రామంలోని ముత్యాలమ్మ ఆలయం వద్ద పేకాల ఆడుతున్న మరో 5 గురిని అదుపులోకి తీసుకున్నట్లు వారి వద్ద నుంచి మొత్తం రూ.5,925 స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. గ్రామాలలో చట్ట వ్యతిరేక పనులకు పాల్పడితే అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకుని కేసులు నమోదు చేస్తామని ఎస్ఐ హెచ్చరించారు.

నూతన క్యాలెండర్లు ఆవిష్కరణ



రెంటచింతల: నూతన సంవత్సరం 2023లో ప్రజలకు మంచి రోజులు రావాలని ప్రభుత్వ విప్, పల్నాడు జిల్లా అధ్యక్షులు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి కోరారు. శనివారం విశాలాంధ్ర దినపత్రిక 2023 సంవత్సరం క్యాలెండర్‌ను ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, పార్టీ రాష్ట్ర యువజన ప్రధాన కార్యదర్శి పిన్నెల్లి వెంకటరామిరెడ్డి, వైఎస్సార్ సీపీ నేతలతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ పీఆర్కే మాట్లాడుతూ 1952 సంవత్సరంలో ప్రారంభించిన విశాలాంధ్ర దినపత్రిక నిత్యం ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూ ప్రజలకు అండగా ఉంటుందన్నారు. 2023 సంవత్సరంలో అర్హులైన ప్రతి ఒక్కరికి ముఖ్యమంత్రి వైస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలుచేస్తున్న ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించి వారికి న్యాయం చేస్తామన్నారు. అనంతరం జెట్టిపాలెం గ్రామానికి చెందిన మేకపోతుల శివారెడ్డి, మేకపోతుల ఈశ్వర్‌రెడ్డి తయారు చేయించిన 2023 వైఎస్సార్ సీపీ క్యాలేండర్‌ను కూడా వారు ఆవిష్కరించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు నవులూరి భాస్కర్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ మండల యూత్ అధ్యక్షుడు గొట్టం చిన బ్రహ్మారెడ్డి, పార్టీ నేతలు చింతా శివారెడ్డి, పమ్మి సీతారామిరెడ్డి, సిద్దవటం కోటిరెడ్డి, పేరం బ్రహ్మారెడ్డి, గొట్టం భాస్కర్‌రెడ్డి, నవులూరి అశోక్ రెడ్డి, ఇగుటూరి మల్లారెడ్డి పాల్గొన్నారు.

ముళ్ల చెట్లు తొలగింపు

దాచేపల్లి : నగర పంచాయతీ పరిధిలోని నాయుడు బిల్డింగ్ ఎదురు రోడ్డులో ముళ్ల చెట్లను శనివారం తొలగించారు. ఈ రోడ్డులో ముళ్ల చెట్లు, పిచ్చి చెట్లు ఏపుగా పెరగడంతో వాహనదారులు, స్థానికులు రాకపోకలు సాగించేందుకు ఇబ్బందిగా ఉంది. ఈ విషయాన్ని స్థానికులు చైర్మన్ షేక్ ఖాదర్‌భాషా, వైస్ చైర్మన్ కొమెరబత్తిన విజయ్‌కుమార్, కమిషనర్ అనిశెట్టి శ్రీవిద్య దృష్టికి తీసుకెళ్లారు. తక్షణమే స్పందించిన చైర్మన్ ఖాదర్‌భాషా ప్రొక్లెయిన్ ఏర్పాటు చేయించి రోడ్డుకు ఇరువైపుల ఉన్న ముళ్ల చెట్లను తొలగించారు. గుంతలమయంగా ఉన్న రోడ్డును కూడా చదును చేశారు.